
నేటితో ముగియనున్న జేఈఈ మెయిన్స్

ఎచ్చెర్ల, జనవరి 31: జాతీయ సాంకేతిక విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ గురువారంతో ముగియనున్నాయి. జిల్లాలోని రెండు కేంద్రాల్లో బుధవారం జరిగిన ఈ పరీక్షలకు 400 అభ్యర్థులకు 395 మంది హాజరయ్యారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండు షిఫ్టుల్లో కలిపి 200కు 194 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 200కు 199 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ఐటీ) ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

మాకూ.. ఓట్లున్నాయోచ్!



అవును మరి! చనిపోయిన వారికీ ఓటు హక్కు ఉంది. అధికారులు జాబితాలో వారి పేర్లు చేర్చారు. పోలింగ్ నాడు ఓటు వేసుకోండని అవకాశం ఇచ్చారు. ఇదంతా నిజమే! సోంపేట మండలం మాకన్నపురం పోలింగ్ కేంద్రం పరిధిలో 45 మంది చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. వీటిని తొలగించాలని ఫిర్యాదు చేసినా చర్యల్లేవ్. ఓటర్ల జాబితా సమగ్రంగా తయారు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించినా.. అధికారులు మాత్రం తప్పిదాలు చేశారు. చాలా కేంద్రాల్లో డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. స్థానికంగా లేనివారి పేర్లూ జాబితాలో చేర్చారు.

- జాబితాలో చనిపోయిన వారి పేర్లు
- మాకన్నపురం పరిధిలో 45 మంది..
- చాలా కేంద్రాల్లో డబుల్ ఎంట్రీలు
- ఒకరికే వేర్వేరు ఎపిక్ నెంబర్లు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)


జిల్లా ఓటర్ల తుది జాబితా గందరగోళంగా ఉంది. జాబితాలో వెతికేకొద్ది లోపాలు వెలుగులోకి వస్తున్నాయి. సమగ్ర ఓటర్ల జాబితా తయారు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించినా.. బీఎల్‌వోలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేక తప్పులు దొర్లాయి. కొందరు బీఎల్‌వోలు అధికార పార్టీ నాయకులు చెప్పిన ప్రకారం ఓటరు జాబితాలు తయారు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ముసాయిదా జాబితాలోని తప్పులే తుది జాబితాలోనూ కనిపిస్తున్నాయి. చనిపోయిన వారి పేర్లు తాజా ఓటర్ల జాబితాలోనూ దర్శనమిస్తున్నాయి. స్థానికంగా లేనివారి ఓట్లను తొలగించలేదు. డబుల్ ఎంట్రీలు, ఒకరికి వేర్వేరు ఎపిక్ నెంబర్లతో రెండేసి ఓట్లు కేటాయించడం వంటి తప్పులు అనేకం ఉన్నాయి.

ఇదీ జిల్లాలో పరిస్థితి

ఇటీవల విడుదలైన ఓటర్ల తుదిజాబితా ప్రకారం.. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 18,76,010 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,22,442, మహిళా ఓటర్లు 9,37,329, థర్డ్ జెండర్స్ ఓటర్లు 139, సర్వీసు ఓటర్లు 16,100 ఉన్నాయి. అయితే ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించామని అధికారులు చెప్పుకొచ్చారు. కానీ, జిల్లా ఓటరు తుదిజాబితాలో ఎన్నో లోపాలు ఉన్నాయి.

- నరసన్నపేట నియోజకవర్గం సారవకోట మండలం వాండ్రాయికి చెందిన ఓటరు జాబితాలో పక్కనియోజకవర్గమైన టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ రంగాపురం గ్రామానికి చెందిన 194 మంది పేర్లు ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు అధికారులను కోరినా చర్యలు లేవు. అలాగే చెన్నాపురంలో డబుల్ ఎంట్రీ ఓట్లు ఉన్నాయి. మరణించినవారి పేర్లను తొలగించలేదు. మూడు చోట్ల కొర్రాయి మణికంఠ అనే వ్యక్తికి ఓటు ఉంది.
- పాతపట్నం నియోజకవర్గంలోని మెళియాపుట్టి మండలం గొట్టిపల్లి పోలింగ్ స్టేషన్ 86లో 170 మందికిపైగా ఓటర్లు ఉన్నారు. అయితే పక్క గ్రామాలకు చెందిన మూలనేలబొంతు, నేలబొంతు ఓటర్లను కూడా ఇక్కడి పోలింగ్ స్టేషన్‌లో చేర్చేశారు. ఈ రెండు గ్రామాల ఓటర్లు గొట్టిపల్లి వచ్చి ఓటువేయాలంటే.. ఐదు కిలోమీటర్లు రావాల్సి ఉంది. వీరి వినతులను అధికారులు కనీసం పట్టించుకోలేదు.
- పలాస నియోజకవర్గం మందసలోని పలు పోలింగ్ కేంద్రాల్లో మరణించినవారి పేర్లను ఓటర్ల జాబితాలో తొలగించలేదు. మొత్తం ఏడు పోలింగ్ స్టేషన్లలో ఆత్మలు ఓటర్లగా నమోదయ్యాయి.
- శ్రీకాకుళం నియోజకవర్గ కేంద్రంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ప్రస్తుతం ఉన్న పోలీస్ పెట్రోల్ బంకు స్థానంలో గతంలో పోలీస్ క్వార్టర్స్ ఉండేది. పోలీస్ క్వార్టర్స్ భవనం శిథిలం కావడంతో దాన్ని తొలగించి పెట్రోల్ బంకు ఏర్పాటు చేశారు. అయితే అప్పుడు క్వార్టర్స్ అడ్రాస్‌తో నమోదైన ఓటర్లలో చాలామంది పేర్లను ఈ పోలింగ్ స్టేషన్‌లో ఉంచారు. విచిత్రమేంటంటే.. ఇక్కడ ఆ భవనమూ లేదు.. అందులో ఉన్న పోలీసులు కూడా బదిలీపై పలుప్రాంతాలకు వెళ్లిపోయారు. అయినా ఇక్కడ వారు ఉన్నట్లు ఓటరు జాబితాను రూపొందించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టిసారించి ఓటర్ల జాబితాను సరిచేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

- ఆమదాలవలస నియోజకవర్గం సరుబుజ్జిలి మండలం మతలబుపేట గ్రామానికి చెందిన పలువరు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిపోయారు. కానీ, ఓటరు జాబితాలో వారి పేర్లు ఉన్నాయి. ఆయా ఓటర్లు అధికార పార్టీ సాను భూతి పరులన్న కారణంగా వారి పేర్లను తొలగించలేదనే విమర్శలు ఉన్నాయి.
- టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం కూర్మనాథపురం, సీతానగరంనకు చెందిన చాలామంది నౌపడలో పోలింగ్ స్టేషన్ 171లో ఓటర్లగా నమోదయ్యారు. ఒకే వ్యక్తికి రెండు చోట్లా ఓట్లు ఉన్నాయి.
- ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేట మండలం మాకన్నపురం పోలింగ్ కేంద్రం పరిధిలో సుమారు 45 మంది వరకు మృతి చెందారు. కానీ, వారి పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయి. వాటిని తొలగించాలని ఫిర్యాదులు అందినా అధికారుల చర్యలు శూన్యం. ఇదే విధంగా కంచిలి మండలం పెద్దశ్రీరామపురంలో పలువురి మృతుల పేర్లు ఓటరు జాబితాలో దర్శనమిస్తున్నా వాటిని తొలగించలేదు.




ఆమదాలవలస ఓటరు జాబితాలో రాజమండ్రికి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి పేరు నమోదైన దృశ్యం



- ఎచ్చెర్ల నియోజకవర్గం లావేరు మండలం పెద్దలింగావలస ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉంది. మరణించినవారి పేర్లను తొలగించలేదు. నియోజకవర్గంలో చాలాచోట్ల డబుల్ ఎంట్రీ ఓట్లను సరిచేయలేదు. కొన్నిచోట్ల పురుష ఓటర్ల పేర్లు మహిళా ఓటర్లగా నమోదయ్యాయి. జి.సిగడాం మండలం మెట్టవలస పోలింగ్ స్టేషన్ 49లో 12 మంది, 48 పోలింగ్ కేంద్రంలో 10 మంది మరణించినా వారి పేర్లు తొలగించలేదు. ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం పోలింగ్ స్టేషన్ 254లో 450 మంది వరకు వేర్వేరు ప్రాంతాలకు తరలివెళ్లిపోయారు. అందులో ఉన్న ఓటర్లలో అధికమంది ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ అడ్రస్‌తో ఓటు నమోదు చేసుకున్నారు. దీనిపై ఇటీవల టీడీపీ, వైసీపీ చెందినవారు కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుచేశారు.

డొంకలపర్తలో..

బూర్జ: మండలంలోని డొంకలపర్త 221 పోలింగ్‌బూత్ పరిధిలో మొత్తం 857 ఓటర్లు ఉన్నారు. తాజా జాబితాలో మృతుల పేర్లు పది కనిపించాయి. మిగిలిన సచివాలయాల పరిధిలోనూ ఇటువంటి తప్పులు దొర్లాయని.. డబుల్ ఎంట్రీలు ఉన్నాయని.. వాటిని సరిచేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆ డబ్బు కావాలంటే.. లంచం ఇవ్వు

- కాశీబుగ్గ జీఎస్టీవో డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన జీడి వ్యాపారి
- రూ.లక్ష తీసుకుంటుండగా పట్టుబడిన వైనం

పలాస, జనవరి 31: ఓ జీడి వ్యాపారి ప్రభుత్వానికి కట్టాల్సిన దానికంటే అదనంగా పన్ను కట్టాడు. ఈ డబ్బులు తిరిగి ఇప్పించాలని ఆయన జీఎస్టీ అధికారిని సంప్రదించాడు. 'డబ్బులు కావాలంటే నాకు లంచం ఇవ్వాల్సిందే. లేదంటే ఇబ్బందులు తప్పవు' అని జీఎస్టీ అధికారి కరాకండిగా చెప్పాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు దాడి చేసి లంచం తీసుకుంటున్న జీఎస్టీ అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్.రమణమూర్తి వివరాల మేరకు.. పలాస మండలానికి చెందిన ఓ జీడి వ్యాపారి తాను ప్రభుత్వానికి కట్టాల్సిన దానికంటే అదనంగా ట్యాక్స్‌ను చెల్లించాడు. ఈ డబ్బులను తిరిగి తనకు ఇప్పించాలని ఆయన కాశీబుగ్గ అసిస్టెంట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులశాఖ)ను సంప్రదించాడు. 'మీరే ప్రభుత్వానికి కట్టాల్సి ఉంటుందేమో పరిశీలించాలి' అని కమిషనర్ చెప్పడంతో జీడి వ్యాపారి వెనుదిరిగాడు. అనంతరం కార్యాలయంలోని జీఎస్టీవో కిషోర్‌కుమార్‌ను సంప్రదించాడు. ఆయన కూడా అదే సమాధానం ఇస్తూ తనకు రూ.1.50 లక్షలు ఇస్తే సమస్యను తక్షణం పరిష్కరిస్తానని చెప్పడంతో వ్యాపారి ఖంగుతిన్నాడు. తనకు రావాల్సిన డబ్బుల కోసం లంచం ఇవ్వాలా అని ఆయన ప్రశ్నించడంతో.. 'ఇచ్చితీరాలి. లేకుంటే ఇబ్బందులు తప్పవు' అని జీఎస్టీవో బెదిరించారు. దీంతో జీడి వ్యాపారి ఏసీబీ అధికారులను సంప్రదించాడు. డీఎస్పీ సూచనల మేరకు బుధవారం మధ్యాహ్నం వ్యాపారి లక్ష రూపాయలను జీఎస్టీవో కిషోర్‌కుమార్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో మొత్తం రికార్డులు, ఏడాదిలో జరిగిన లావాదేవీలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ వ్యవహా రంలో ఇంకెవరి పాత్ర ఏమైనా ఉందా అని ఆరా తీశారు. సిబ్బంది నుంచి వ్యక్తిగతంగా సమాచారాన్ని సేకరించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. కిషోర్‌కుమార్‌ను గురువారం విశాఖపట్నం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.



లంచంతో పట్టుబడిన జీఎస్టీవో కిషోర్‌కుమార్

అవినీతికి అడ్డాగా..

కాశీబుగ్గ అసిస్టెంట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులశాఖ) కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఇక్కడ సీటీవోగా పనిచేసిన నూకరాజు అధిక మొత్తంలో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఈ ఏడాది ప్రారంభంలో రికార్డు అసిస్టెంట్ ఒకరు ఏసీబీకి పట్టుపడగా తాజాగా జీఎస్టీ అధికారి చిక్కాడు. ఒకే కార్యాలయంలో ఇప్పటికి నాలుగుసార్లు ఏసీబీ అధికారులు దాడులు చేశారంటే అక్కడ ఏస్థాయిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. జీడి, బియ్యం వ్యాపారులతో పాటు వాణిజ్య కేంద్రంగా ఎదుగుతున్న పలాస నియోజకవర్గం నుంచి రాష్ట్ర పన్నులశాఖకు అధిక మొత్తంలో ఆదాయం వస్తుంది. దీన్ని అలుసుగా చేసుకొని ఆ శాఖ అధికారులు లంచావతారం ఎత్తుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

ఏం జరిగిందో?

- ఒకే ఇంట్లో అచేతనంగా నలుగురు
- బాలిక మృతి, మిగతా ముగ్గురు ఆస్పత్రికి..
- తొలుత ఆత్మహత్యాయత్నంగా అనుమానం
- విషపూరిత వాయువు పీల్చడం వల్లేనంటున్న స్థానికులు
- జీరుపాలెంలో ఘటన



భవానీ(ఫైల్)

రణస్థలం, జనవరి 31: మండలంలోని మత్స్యకార గ్రామమైన జీరుపాలెంలోని ఒకే ఇంటిలో నలుగురు అచేతనంగా పడి ఉన్న ఘటన కలకలం సృష్టించింది. వీరిలో బాలిక మృతి చెందగా, మిగతా కుటుంబ సభ్యులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. తొలుత సామూహిక ఆత్మహత్యాయత్నంగా భావించినా.. తరువాత విషపూరిత వాయువు పీల్చడం వల్లే ఈ ఘటన జరిగి ఉంటుందేమోనని స్థానికులు చర్చించుకుం టున్నారు. ఇందుకు సంబంధించి జేఆర్‌పురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీరుపాలెం గ్రామంలో చీకోటి నాగరాజు కుటుంబంతో జీవనం సాగిస్తు న్నాడు. బుధవారం వేకువజామున నాగరాజు చేపల వేటకు వెళ్లిపోయాడు. అయితే ఉదయం ఎనిమిది గంటలవుతు న్నా కుటుంబం బయటకు రాకపోయేసరికి పక్కింటి వారు తలుపులు తట్టారు. నాగరాజు కుమారుడు రాజు అతి కష్టమ్మీద తలుపులు తీశాడు. లోపల నాగరాజు భార్య సంధ్య ఆమె తల్లి లక్ష్మి, ఏడేళ్ల కుమార్తె భవానీ అచేత నంగా పడి ఉన్నారు. దీంతో స్థానికులు వారిని హుటాహు టిన పాత్రపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే భవానీ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నాగరా జు ఆస్పత్రిలో కోలుకోగా.. సంధ్య, లక్ష్మిలకు ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్క డ రిమ్స్‌లో వారిద్దరూ కోలుకున్నట్టు తెలుస్తోంది. అయితే తొలుత వీరిది ఆత్మహత్యాయత్నంగా అంతా భావించారు. కానీ ఇంట్లో అటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. ఇల్లు ఇరుకుగా ఉండడం.. బొగ్గుల పొయ్యి నుంచి పొగ వస్తుండడంతో ఊపిరాడక ఈ ఘటన జరిగి ఉంటుందేమోనని స్థానికులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలాన్ని జేఆర్‌పురం సీఐ రామచంద్రరావు పరిశీలించారు. తల్లి చీకోటి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని.. బాలిక మృతదేహం పోస్టుమార్టం బట్టి ఒక నిర్ణయానికి వస్తామని ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు.



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న జేఆర్‌పురం సీఐ

అవినీతి పాలనను అంతం చేద్దాం

- చంద్రబాబును గెలిపించుకుందాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 31: 'రాష్ట్రంలో అవినీతి పాలనను అంతం చేద్దాం.. ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించుకుందాం' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యుడు కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలంలోని తిలారు, రేగులపాడు, ఎత్తురాళ్లపాడు పంచాయతీల్లోని గవిరమ్మపేట, పేటపాడు, పంతులపేట, ఎత్తురాళ్లపాడు గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత అందించబోయే సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో రాష్ట్ర 20ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, నాయకులు వెలమల కామేశ్వరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణరావు, పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

అచ్చెన్నాయుడు సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టెక్కలి మండలం రాయివలస పంచాయతీ వార్డు మెంబర్ దాసరి రాము, నర్తు ఆమిన్, వారి అనుచరులు, కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు పంచాయతీకి చెందిన చల్లరాము టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పార్టీ కండువా చేసి అచ్చెన్నాయుడు ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ టెక్కలి మండల అధ్యక్షుడు బగాది శేషు, సీనియర్ నాయకుడు ఎల్ఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువా వేస్తున్న కింజరాపు అచ్చెన్నాయుడు

మేం ఉండము సారో!

- 'ఆసరా' సభ నుంచి వెళ్లిపోయిన మహిళలు
- ఎండలో కూర్చోబెట్టడంపై మండిపాటు
- బలవంతంగా తీసుకొచ్చినా కుర్చీలు ఖాళీ

ఇచ్ఛాపురం, జనవరి 31: ఇచ్ఛాపురంలోని టూరిజం పార్కు వద్ద జడ్పీ చైర్‌పర్సన్, వైసీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ ఆధ్వర్యంలో బుధవారం ఆసరా నాలుగో విడత సభ నిర్వహించారు. ఈ సభకు మునిసిపాలిటీలోని 23 వార్డులతో పాటు మండలంలోని డ్వాక్రా మహిళలను బలవంతంగా తీసుకొచ్చారు. అయితే, వీరికి తగ్గట్లు ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకులు విఫలమయ్యారు. సగం వరకే టెంట్లు వేసి మిగతా స్థలంలో కుర్చీలు వేశారు. దీంతో ఎండకు తట్టుకోలేక మహిళలు గేట్లు తీసి మరి బయటకు పరుగులు తీశారు. సమావేశం జరుగుతుండగానే మహిళలు వెనుతిరుగుతుండడంతో గేట్ల వద్ద మెప్మా సిబ్బంది, ఆర్‌పీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా మహిళలు ఆగకుండా వారిని తోసుకుంటూ బయటకు వచ్చేశారు. ఎండలో తమను కూర్చోబెట్టారని, కనీసం తాగటానికి నీరు కూడా ఇవ్వలేదని వైసీపీ నేతలపై మహిళలు మండిపడ్డారు. వైసీపీ నాయకులు స్టేజ్ వద్ద నుంచి మైక్‌లో ఆగండి ఆగండి అని కేకలు వేసినా ఎవరూ పట్టించుకోకుండా వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.



సభ నుంచి వెళ్లిపోతున్న మహిళలు

ప్రత్యేక హోదా కోసం
పోరాటం కొనసాగిస్తాం

- సాధనా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని

శ్రీకాకుళం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలసాని శ్రీనివాస్, విశ్రాంత సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం శ్రీకాకుళంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'రాష్ట్రానికి పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమకు కేబీకే, బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయాలి. ఉమ్మడి ఆస్తుల పంపకాలను చేపట్టి రాష్ట్రానికి రావాల్సిన వాటాను అప్పగించాలి. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక గనులు కేటాయించి నిధులు సమకూర్చి అభివృద్ధి చేయాలి. శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర విద్యాసంస్థలను నెలకొల్పి నిధులు సమకూర్చాలి. ఈ డిమాండ్ల సాధనకు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ ఏకమై పోరాటం చేయాలి.' అని కోరారు. ఈ సమావేశంలో సాధన సమితి జిల్లా అధ్యక్షుడు నర్సునాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ, సీపీఎం నాయకులు సుందరలాల్, సింహాచలం, అమ్మన్నాయుడు, విశ్రాంత డీఈవో మల్లేశ్వరరావు, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యారావు, బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని, పక్కన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు మద్దతివ్వాలి

జిల్లాలో పర్యటించిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు బుధవారం కలిశారు. న్యాయవాదులకు గొడ్డలిపెట్టుగా మారిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుకు మద్దతివ్వాలని కోరారు.

ఉత్సాహంగా పల్లె పల్లెకు టీడీపీ, బాబు ష్యూరిటీ


సారవకోట మండలం కిన్నెరవాడలో భవిష్యత్తు గ్యారెంటీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ


వజ్రపుకొత్తూరు: రాజాంలో పల్లెపల్లెకు టీడీపీ నిర్వహిస్తున్న నాయకులు


పలాసరూరల్: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు


పొందూరు: బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ అధిష్ఠానం పిలుపు మేరకు గ్రామాల్లో పల్లె పల్లెకు టీడీపీ, బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ, టీడీపీ జెండా పండగ కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. పెద్ద ఎత్తున పార్టీ క్యాడర్ పాల్గొంటోంది.

చంద్రబాబు మళ్లీ సీఎం కావాలి

పలాస/కాశీబుగ్గ: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ సీఎం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. పలాస కాశీబుగ్గ 1వ వార్డు, శివాజీనగర్‌లోని మదర్ థెరిసా విద్యాలయంలో టీడీపీ యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమని, కొద్ది రోజులు కష్టపడి వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలన్నారు. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలన చేసి ప్రతీ 60మంది ఓటర్లకు ఒక కుటుంబ సాధికారిక సారథుల నియామకానికి సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంకాల రవి శంకర్ గుప్తా, నాయకులు మల్లా శ్రీనివాస్, కొత్త సత్యం, రామకృష్ణ, జోగ మల్లి, డొక్కరి శంకర్, దడియాల నర్సింహులు, యవ్వారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పథకాలపై అవగాహన కలిగించాలి

పలాసరూరల్: టీడీపీ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని పార్టీ సమగ్ర శిక్షకుడు తిరుపతిరావు అన్నారు. రెంటికోటలో బుధవారం టీడీపీ ఇంటిగ్రేటెడ్ శిక్షణ తరగతులు నిర్వహించారు. మన టీడీపీ యాప్, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటరు వెరిఫికేషన్, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, నాయకులు పి.విఠల్ రావు, దువ్వాడ సంతోష్, తమ్మినాన గంగారామ్, అవుగాన దశరథ, బి.సూర్య కృష్ణంరాజు, కూర్మారావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: బగ్గు

నరసన్నపేట: ప్రస్తుత రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర భవిష్యత్, రాష్ట్రాభివృద్ధి సాధించాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. బుధవారం పట్టణంలో 12వ వార్డు శివనగర్ కాలనీ, కలాసీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ పాలనలో గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి జాడలు కనిపించడం లేదని, కబ్జాలు, దాడులు మాత్రమే కనిపిస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, నాయకులు గొద్దు చిట్టిబాబు, ఉణ్న వెంకటేశ్వరరావు, బెవర రాము, పీస కృష్ణ, గొలివి రామారావు, బోయన ఆనంద్, గుణుపురం రామలక్ష్మి, హరి, గోపి తదితరులు పాల్గొన్నారు.


పలాస: మాట్లాడుతున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాబు


నరసన్నపేట: కలాసీ కాలనీలో బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న బగ్గు రమణమూర్తి

● **జలుమూరు, (సారవకోట):** రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీకి ఓటువేసి చంద్రబాబు నాయకత్వాన్ని బలపర్చాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. కిన్నెరవాడలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి పట్టు ఉమామహేశ్వరరావు, నాయకులు మట్ట గోవిందరావు, తర్ర లచ్చుము, చల్ల జనార్దన తదితరులు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. బుధవారం రాజాం, గరుడభద్ర, కొత్తపేట గ్రామాల్లో పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలతో వైసీపీ ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయానికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పనిచేయాలని కోరారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నేతలు పి.సాంబమూర్తి, బి.శశిభూషణ్, ఎ.ఉమామహేశ్వరరావు, కర్ని రమణ, పుచ్చ ఈశ్వరరావు, మరడ దుర్యోధనరెడ్డి పాల్గొన్నారు. ● **పొందూరు:** కింతలిలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.హనుమంతురావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో జెండా పండగ


ధనుపురం గ్రామంలో టీడీపీ జెండాలతో నిండిన ఒక వీధి


కొత్తూరు: జెండా పండగలో పాల్గొన్న కలమట వెంకటరమణ

హిరమండలం: హిరమండలం మండలంలోని గ్రామాలు బుధవారం పచ్చదనంతో కళకళ లాడాయి. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆధ్వర్యంలో జెండా పండగ నిర్వహించారు. పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఇళ్లపై జెండాలను ఏర్పాటు చేశారు. దుర్బలాపురంలో ఓ వీధిలో అన్ని ఇళ్లపైనా పార్టీ జెండాలను ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ● **మెళియాపుట్టి:** టీడీపీ జెండా పండుగ బుధవారం స్థానిక పార్టీ నాయకులు నిర్వహించారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి ఇళ్లపై పార్టీ జెండాలను కట్టారు. పట్టుపురంలో ముస్లిం విద్యార్థులు జెండాలు పట్టుకుని మద్దతు తెలిపారు. ముస్లిం నాయకుడు సిలార్ తదితరులు పాల్గొన్నారు. ● **కొత్తూరు:** కుద్దిగాం, మాకువరం గ్రామాల్లో బుధవారం టీడీపీ జెండా పండగను నిర్వహించారు. పార్టీ జెండాను మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి ఎగుర వేశారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


జెండాలు పట్టుకుని మద్దతు తెలుపుతున్న ముస్లిం విద్యార్థులు

నాగుపాము కలకలం

● బుల్లెట్‌లోకి చొరబడిన నాగుపాము

నరసన్నపేట: స్థానిక పెద్దపేటలో ఒక వస్త్ర దుకాణం ఎదుట పార్కింగ్ చేసిన బుల్లెట్ లోకి నాగుపాము చొరబడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. వస్త్రాలు కొనుగోలుకు వచ్చి బుల్లెట్‌ను పార్కింగ్ చేయగా అందులోకి నాగుపాము ప్రవేశించింది. దీనిని గమనించిన ఇతరులు యజమానికి తెలియజేశారు. దుకాణం సిబ్బంది బండిలో చొరబడిన నాగు పామును బయటకు పంపేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఎట్టకేలకు దానిని బయ టకు తీశారు. పార్కింగ్ చేసి ఉన్న వాహనాల్లో పాములు చొరబడడం ఇటీవల కాలంలో ఎక్కువవడంతో ఈ ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.


బుల్లెట్ హ్యాండిల్‌పై ఉన్న పాము (వృత్తంలో)

అప్పలనాయుడు మాస్టారు ఆదర్శం

నరసన్నపేట: ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తీసుకువచ్చిన వ్యక్తి అప్పల నాయుడు మాస్టారు అని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు అన్నారు. బుధవారం బొరిగివలస ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన అప్పలనాయుడు మాస్టారు సత్కరించారు. స్వగ్రామంలో కంబకాయిలో ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్ది గ్రామానికి ఆదర్శనీయుడిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మిత్రులు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అప్పలనాయుడు మాస్టారుకు సత్కారం

డాక్టర్ మోహనరావు కుటుంబానికి పరామర్శ

పలాస: స్థానిక కిడ్నీ పరిశోధన కేంద్రం ఆర్ఎంవో డాక్టర్ కూన మోహనరావు కుటుం బాన్ని సీనియర్ కౌన్సిలర్, కార్మిక సంఘాల గౌరవాధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్, వజ్రపుకొత్తూరు మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు (స్వామి) బుధవారం పరామర్శించారు. మోహనరావు తండ్రి నారాయణరావు మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. వారి కుటుంబం ఆమదాలవలస మండలం మెట్టక్కివలసలో ఉండడంతో అక్కడికి వెళ్లి పరామర్శించి తమ సానుభూతి తెలిపారు. నారాయణరావు మృతిపట్ల టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు హనుమంతు వెంకటరావు, వైద్యులు ఎం.మల్లేశ్వరరావు, టి.బాలకృష్ణ, హరిరాజ్‌కుమార్, పొందల జగదీష్ పరామర్శించి సంతాపం ప్రకటించారు.


కూన మోహనరావును పరామర్శిస్తున్న దువ్వాడ శ్రీకాంత్, వసంతరావు(స్వామి)

దళిత శ్మశానాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

టెక్కలి: దళిత శ్మశాన వాటికలకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పాల పోలారావు మాట్లాడుతూ.. దళితవాడల్లో తాగునీరు, మురుగు కాలువలు, సీసీ రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇళ్లు లేని పేద దళితులకు జగనన్న కాలనీ ఇళ్లు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం నిలిపి వేసిన 28 సంక్షేమ పథకాల ద్వారా దళితులు ఆర్థికాభివృద్ధికి తక్షణం రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సహచట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు అనపాన షణ్ముఖరావు, డీహెచ్‌పీఎస్ నాయకులు బమ్మిడి వేణు, అక్కురాడ శ్రీనివాసరావు, చిట్టి సింహాచలం, సామ కృష్ణారావు, లోపింటి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

అప్రెంటిస్ విధానం పునరుద్ధరణను ఖండిస్తున్నాం

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి

జలుమూరు: ఎన్నో ఉద్యమాల ద్వారా రద్దయిన అప్రెంటిస్ విధానాన్ని పునరుద్ధరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి తెలిపారు. జలుమూరులో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీలో 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం 6,100 పోస్టులు భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ వేసేందుకు మంత్రివర్గం నిర్ణయించడం దారుణమన్నారు. అన్ని ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ద్వారా నియమించబడే ఉపాధ్యాయులకు రెండేళ్లు గౌరవ వేతనం ఇస్తామని తీసుకున్న నిర్ణయం కూడా ఎన్నో ఉద్యమాల ద్వారా రద్దు కాబడిన అప్రెంటిస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించడమేనని భావిస్తున్నామన్నారు. డీఎస్సీ ద్వారా చేపట్టే నియామకాలన్నీ రెగ్యులర్‌గానే ఉండాలని, వారిని పూర్తి వేతనంతో నియమించాలని ఆమె డిమాండ్ చేశారు.

జీడి రైతుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయండి

● గౌతు శిరీషను కోరిన జీడి రైతాంగ సాధన కమిటీ సభ్యులు

పలాసరూరల్: ఉద్దాన ప్రాంతంలో ప్రధాన పంట అయిన జీడికి గిట్టుబాటు ధర కల్పించి జీడి రైతుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని జీడిరైతాంగ సమస్యల సాధన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం బొడ్డపాడు గ్రామంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందించారు. జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఉద్యమాలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ఈ ప్రాంతంలో ప్రధాన పంటగా వేలాది మంది జీడిపంటపై ఆధారపడి బతుకుతున్నారని, జీడికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలన్నారు. గతంలో ఓట్లకు వచ్చిన పార్టీలకు విన్నవించినా ఫలితం లేదని, పోరాటాలు చేసి అలసిన తమకు న్యాయం చేయాలని కోరారు. జీడి పంటకు రూ.16 వేల ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ నెల 5న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పలాస రానున్నందున ఆయనను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం. మాధవరావు, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, మద్దిల ధర్మారావు, కిక్కర ఢిల్లీరావు, రాజాం గుణవంతు, గణపతి పాల్గొన్నారు.


గౌతు శిరీషకు వినతిపత్రం ఇస్తున్న జీడి రైతాంగ సాధన కమిటీ సభ్యులు

ఐక్యతతోనే తెలగ సామాజికవర్గ సమస్యల పరిష్కారం

హరిపురం: ఐక్యతతోనే తెలగ సామాజికవర్గ సమస్యల పరిష్కరించుకోవచ్చని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు అన్నారు. పాదయాత్రలో భాగంగా బుధవారం హరిపురం వచ్చి ఇక్కడి నుంచి పలాస చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. తెలగ సామాజికవర్గ ప్రజలంతా ఒక్క తాటిపై వచ్చి తమను పట్టించుకోని ప్రభుత్వాలపై పోరాటం చేయాలన్నారు. ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1961 వరకు బీసీల్లో ఉన్న తెలగ కులస్థులను స్వార్థ రాజకీయాల వల్ల ఓసీల్లో చేర్చారని విమర్శించారు. తమ సమస్యలను పరిష్కరించే పార్టీలకే మద్దతు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలగ సంఘ అధ్యక్షుడు ఇనుముల జనార్దన, త్రిపురాన రాజేంద్రదాస్, బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న తెలగ సంఘ నాయకులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి


వసుంధర సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

మెళియాపుట్టి: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. బుధవారం వసుంధర సచివాలయాన్ని సందర్శించి జగనన్న లేవుట్‌లో ఇచ్చిన పట్టాదార్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇబ్బందులుంటే సత్వరం పరిష్కార మార్గం చూపాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దన్నారు. అనంతరం జరిబద్ర, వెంకటాపురంలో లేవుట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సరోజిని, ఆర్ఐ వైకుంఠరావు, వీఆర్వో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం కావాలి


మాట్లాడుతున్న గురుకులాల జిల్లా సమన్వయాధికారి బాలాజీనాయక్

పాతపట్నం: ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేయాలని గురుకులాల జిల్లా సమన్వయాధికారి బాలాజీ నాయక్ అన్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పది, ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడుతూ.. ఆత్మ విశ్వాసంతో చదవాలని, తద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్వీ కృష్ణతార, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన, కొల్లివలస ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం రేపు

నందిగాం: నందిగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు సాహుకారి మహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగాగా ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు, ఘటాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, సహాయకుడు రమేష్‌శర్మ పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మూడో తేదీకి వేలం పాట వాయిదా

నరసన్నపేట: నరసన్నపేట మేజర్ పంచాయతీలో రోజువారీ మార్కెట్, సంత వేలం పాట లను వాయిదా వేసినట్లు డీఎల్పీవో రవిగోపి తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యా లయంలో వేలం పాట నిర్వహించారు. అయితే గతేడాది కంటే తక్కువకు కాంట్రాక్టర్లు బహిరంగ వేలంలో పాడడంతో ఈనెల 3వ తేదీ నాటికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో చిన్నారావు, సర్పంచ్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అందించాలి

పలాసరూరల్: మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులకు కనీస వేతనం అందజేయాలని ఆ సంఘ నేతలు డిమాండ్ చేశారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని, బీమా, ఐడీ కార్డుల పంపిణీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ మేరకు ఎంఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడు తూ.. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 3వ తేదీ వరకు మండల కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టనున్నా మని, 5న శ్రీకాకుళం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో సీఐటీ యూ నాయకుడు గణపతి, మధ్యాహ్నభోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

'సాగర సంగ్రామ దీక్ష'ను విజయవంతం చేయండి

జలుమూరు: ఓపీఎస్ సాధించేందుకు ఈనెల 4న విశాఖ జీవీఎంసీ ఎదురుగా 'ఓట్ ఫర్ ఓపీఎస్' అనే నినాదంతో సాగర సంగ్రామ దీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు మెండ రామారావు తెలిపారు. చల్లవానిపేట, అచ్యుతాపురం, శ్రీముఖలింగం, నగిరికటకం పాఠశాలలను బుధవారం సందర్శించి పోస్టర్లను ఆవిష్కరించారు. గత ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వారికే మా ఓటు అనే నినాదంతో ఈ దీక్ష చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కోటబొమ్మాళి: పశుసంవర్ధక శాఖలో విధులు నిర్వహిస్తున్న గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు బుధవారం పలువురు గోపాలమిత్రలు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. చాలా కాలంగా గోపాల మిత్రలుగా పనిచేస్తూ పాడి రైతులకు సేవలు అందిస్తున్నామని, కానీ మా ఉద్యోగానికి భద్రత లేదని, టీడీపీ మేనిఫెస్టోలో మా సమస్యను పెట్టాలని కోరారు. దీనికి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. పార్టీ అధినేత చంద్రబాబుతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోపాల మిత్ర కర్రి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

హిరమండలం: హిరమండలం పీఏసీఎస్ ద్వారా రైతులు తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ కోరారు. ఫిబ్రవరి 29లోగా రెన్యువల్ చేసుకుంటే 7 శాతం వడ్డీ పడుతుందని, ఆ తరువాత 13 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణాలు రెన్యువల్ చేసుకునేందుకు ఆధార్ జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ ఫొటోలు, బ్యాంకు అకౌంట్, రేషన్ కార్డు జిరాక్సు కాపీలు, 1బి తీసుకురావాలని ఆయన తెలిపారు.

కుమార్తె పెళ్లి సంబంధానికి వెళ్తూ మృత్యుఒడిలోకి..

● అదుపుతప్పి బైక్‌ని ఢీకొన్న కారు ● మరొకరికి తీవ్ర గాయాలు

నందిగాం: కుమార్తె పెళ్లి సంబంధం నిమిత్తం వెళ్తూ ఓ తండ్రి మృత్యుఒడిలోకి వెళ్లిన ఘటన బుధవారం విషాదం నింపింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మెళియాపుట్టి మండలం జర్రిభద్రకు చెందిన వంజంగి గణపతి (51) అదే గ్రామానికి చెందిన కొర్ల జనార్దనరావుతో కలిసి కుమార్తె పెళ్లి సంబంధం నిమిత్తం ద్విచక్రవాహనంపై టెక్కలి వెళ్తున్నారు. అయితే టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న కారు పెద్దబాణాపురం సమీపంలో హైవేపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డుపై బోల్తాపడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న గణపతిరావు, జనార్దనరావులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా గణపతి చికిత్స పొందుతూ మృతిచెందాడు. జనార్దనరావుకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. గణపతి భార్య ఆమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం హెచ్‌సీ ఢిల్లేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బాలకృష్ణ(ఫైల్)

నందిగాం: నందిగాం దిగువ బీసీ కాలనీకి చెందిన నక్క బాలకృష్ణ (34) రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నందిగాం అండర్‌పాసేజ్ సర్వీస్ రోడ్డు సమీపంలో వెల్డింగ్‌షాపు నిర్వహి స్తున్న బాలకృష్ణ మంగళవారం సాయంత్రం పెద్ద తామరాపల్లి పని నిమిత్తం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా మద్దిలివానిపేట సమీపంలో హైవేపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. అందరితో కలివిడిగా ఉండే బాలకృష్ణ మృతి చెందడంతో నందిగాంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈయనకు ఏడేళ్ల కిందట వివాహం కాగా ఇద్దరు కుమారులు సిద్ధి విలాస్ (5), కౌసిక్(3) ఉన్నారు. బాలకృష్ణ మృతితో భార్య మహాలక్ష్మి, తల్లిదండ్రులు బానమ్మ, కామయ్య, ఇతర కుటుంబసభ్యులు రోదనలతో ఆ ప్రాంతం కన్నీటిపర్యంతమైంది. మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. నందిగాం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడు..

లావేరు: బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై బుధవారం వేకుజామున విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యాచకుడు మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 13 మందికి గాయాలు


రోడ్డుపై క్షతగాత్రులు, పొలంలో బోల్తాపడిన ఆటో

ఎల్ఎన్‌పేట: అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుపై పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. హిరమండలం మండలం కొండరాగోలు గ్రామానికి చెందిన టి.సత్యవతి, అమ్మన్నమ్మ, బి.చిన్నమ్మి, శాంతి, జె.ఆరుద్రమ్మలతోపాటు మరో 8 మంది హిరమండలం వైపు నుంచి సరుబుజ్జిలి వైపు ఆటోలో వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఆటో పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చే సరికి అదుపు తప్పి పల్టీలు కొట్టి పొలంలో పడిపోయింది. దీంతో ఆటోలో ఉన్న 13 మందికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని లక్ష్మీనర్సుపేట పీహెచ్‌సీకి మరో ఆటోలో తరలించగా వైద్యాధికారి సునీత, సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. వీరిలో బలమైన గాయాలైన ఇద్దరిని 108 వాహనంలో శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించారు. తమకు జీజీహెచ్ నుంచి ఎటువంటి సమాచారం రాలేదని పోలీసులు తెలిపారు.

'రాజకీయ లబ్ధి కోసమే షర్మిల ప్రయత్నాలు'

గుజరాతీపేట: ప్రత్యేక హోదా సాధనే వైసీపీ లక్ష్యమని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయ లబ్ధికోసమే ఆమె ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు.

ఓటర్ల జాబితాలో సవరణలకు 10,304 దరఖాస్తులు

శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా తదితర సవరణల కోసం ఇప్పటివరకు 10,304 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు తెలిపారు. బుధవారం ఆయన రాజకీయపార్టీల ప్రతినిధులతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ వారం రోజుల్లో మార్పులు, చేర్పుల కోసం 4,227 దరఖాస్తులు అందాయని చెప్పారు. గతేడాది డిసెంబరు 12 నుంచి ఇప్పటివరకు కొత్తగా ఓటు హక్కు కోసం 12,267 దరఖాస్తులు అందాయని వివరించారు. పరిశీలించి ఓటు హక్కు కల్పించి సప్లమెంటరీ జాబితాలో చేరుస్తామని చెప్పారు. ఇతర సవరణలు, పేర్ల మార్పుకోసం 10,304 మంది దరఖాస్తు చేశారని, ఇందులో 454 తిరస్కరించామని వివరించారు.

అక్కుపల్లి బీచ్ అభివృద్ధికి ఐదెకరాలు కేటాయింపు

శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి బీచ్ అభివృద్ధికి ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గజిట్ ప్రచురించింది. అక్కుపల్లి వద్ద ఐదు ఎకరాల విస్తీర్ణం గల పోరంబోకు భూమిని పర్యాటక శాఖకు మంజూరు చేయాలని గతేడాది జిల్లా కలెక్టర్ ద్వారా సర్వేశాఖకు, ఇతర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

కొనసాగుతున్న అధికారుల బదిలీలు

శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉప కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. జిల్లాలో కేఆర్ఆర్‌సీ విభాగం ప్రత్యేక ఉపకలెక్టర్‌గా బి.సుదర్శన్‌దొర నియమితులయ్యారు. ఈయన ఇప్పటివరకు పార్వతీపురం జిల్లా తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు యూనిట్-3 ఎస్‌డీసీగా విధులు నిర్వహించారు. అలాగే శ్రీకాకుళం ఎఫ్ఎస్‌వోగా ఉపకలెక్టర్ ఎం.అప్పారావు నియమితులయ్యారు. బీఆర్ఆర్ వంశధార యూనిట్-4 ప్రత్యేక ఉపకలెక్టర్ జి.జయదేవి విశాఖ ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రత్యేక ఉపకలెక్టర్ వెంకటసత్యసాయి రామమోహన్ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. పాలకొండ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న ఎం.లావణ్య జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా, బొబ్బిలి భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న డి.వెంకటేశ్వరరావు జిల్లా పరిషత్ సీఈవోగా నియమితులయ్యారు.

తైక్వాండో పోటీలకు అక్కాతమ్ముడు


జాతీయస్థాయికు ఎంపికైన ఇక్షిత, సాక్షిత్

శ్రీకాకుళం స్పోర్ట్స్: నగరానికి చెందిన జామి ఇక్షిత, జామి సాక్షిత్ జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఇప్పటికే అనేక రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించి పలు పతకాలు సాధించి నేడు మరోసారి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 20, 21వ తేదీల్లో నంద్యాల జిల్లాలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ జాతీయస్థాయి పోటీలు పుదుచ్చేరి వేదికగా ఈ నెల 7వ తేదీ నుంచి జరగనున్న జాతీస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరిద్దరు జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్‌లో శిక్షణ పొందుతున్నారు.

అరాచక పాలనకు ఓటుతోనే బుద్ధిచెప్పాలి

● టీడీపీలో వైసీపీ కుటుంబాలు చేరిక
● పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళావెంకటరావు


వైసీపీ కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కళావెంకటరావు

జి.సిగడాం: రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతుందని, ఈ ప్రభుత్వాన్ని ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంటరావు పిలుపునిచ్చారు. పాలఖండ్యాం నుంచి 10 వైసీపీ కుటుంబాలు బుధవారం జి.సిగడాం పార్టీ క్యాంప్ కార్యాలయంలో కళా వెంటరావు సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన పోతల త్రినాథరావు, చిర్రా గోవిందరావు, గుంటుబోను చిమ్మారావు, కె.సీతారాం, లోపింటి రమేష్, గుంటుబోను శంకరరావు, చిల్లా తిరుపతిరావు, పలిశెట్టి చిన్నారావులతో పాటు పలువురిని టీడీపీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 43వేల కోట్లు అక్రమాస్తుల కేసులో 16 నెలల జైల్లో ఉన్న జగన్‌రెడ్డి ముఖ్యమంత్రికి కావడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమన్నారు. తాను జైల్లో ఉన్నాను కనుక ఎలాగైనా చంద్రబాబును జైల్లో పెట్టాలనే కుట్ర, రాజకీయ కక్షతో అరెస్టు చేయించారని మండిపడ్డారు. తల్లి, చెల్లిని చూడనివాడు రాష్ట్ర ప్రజలకు ఏమి ఉద్ధరిస్తాడు అని ఎద్దేవా చేశారు. జగన్‌రెడ్డి పాలనపై రాష్ట్ర ప్రజలు విసుగుచెందారని, ఎప్పుడు ఎన్నికలు వస్తాయో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామా అని ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, బెవర జగన్నాథరావు, పలిశెట్టి చంద్రరావు, సిగటాపు గోవిందరావు, మహాదాశ్యం చిన్నారావు, పైల రామకృష్ణంనాయుడు, నక్క మురళి, కోన వెంకటరావు, జక్కంపూడి దాసు, విక్రం కాశీబాబు, చిత్తిరి అసిరినాయుడు, పి.శ్యామలరావు, విక్రం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే


కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఇచ్ఛాపురం: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. బుధవారం మునిసిపాలిటీలోని ఆరోవార్డు పొందర వీధిలో రూ.ఐదు లక్షల ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారని, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి నందికిజాని, రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, ఆరో వార్డు ఇన్‌చార్జి కొరాయి ధర్మరాజు, తెలుగుయువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, కౌన్సిలర్ పత్రి తవిటయ్య, ఆశి లీలారాణి, నాయకులు రెయ్యి జానికిరావు, బి.కృష్ణయ్య జిలానీ, దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, ఆశి జీవులురెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఈబీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు

శ్రీకాకుళం క్రైం: ఎస్ఈబీ సూపరింటెండెంట్‌గా సీహెచ్ తిరుపతినాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎస్పీ జీఆర్ రాధికను ఆమె కార్యాలయంలో తిరుపతి నాయుడు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. తొలుత బాధ్యతలు చేపట్టిన ఆయన ఇన్‌చార్జిగా ఉన్న ఏఎస్పీ మణికంఠ నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి


ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సత్కరించిన ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐ ఎల్.బాలుడు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్స్ టి.రాంబాబు, బీవీ కృష్ణారావులకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దుశ్శాలువలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఏఎస్పీలు విఠలేశ్వరరావు, తిప్పేస్వామి, ఏవో సీహెచ్ గోపినాథ్, డీఎస్పీ కేవీఎస్ నివాసన్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

● **లావేరు:** సమాజంలో పనిచేస్తున్న ఏ స్థాయి ఉద్యోగికైనా వారు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఉపాధి పథకం ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ లోకేష్, ఎంపీడీవో కె.సురేష్ కుమార్ అన్నారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో సాంకేతిక సహాయకుడిగా ఎంపికైన ఇప్పిలి గౌరినాయుడును ఘనంగా సన్మానించారు.

ఘనంగా మనదేశం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో ఆంధ్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు తుతార ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం మన దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. వందేమాతరం, మా తెలుగుతల్లి, జనగణమణ గీతాలను 500 మంది విద్యార్థులతో ఆలపించారు. ఈ సందర్భంగా దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు.

కేజీబీవీ విద్యార్థుల క్షేత్రపర్యటన

పొందూరు: వృత్తి విద్యాకోర్సులపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మండలం లోలుగు కేజీబీవి 9వ తరగతి విద్యార్థులు బుధవారం మండలకేంద్రంలో క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఏఎఫ్‌కేకే సంఘం పరిధిలో ఖాదీకార్మికుల ఇళ్లను పరిశీలించారు. ఖాదీవస్త్రాల తయారీ, ఖాదీ ప్రక్రియలను పరిశీలించారు. కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యం

శ్రీకాకుళం స్పోర్ట్స్: మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా వంటి క్రీడాపోటీలు దోహదపడతాయని, ప్రతి మనిషి ఆరోగ్యానికి క్రీడలు మేలు చేస్తాయని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో బుధవారం జిల్లాస్థాయి ఆడుదాం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఎనిమిది నియోజక వర్గాల్లో విజేతలైన వారికి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నారని, ఇందులో గెలుపొందిన వారికి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, డీఈవో కె.వెంకటేశ్వరరావు, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, శిక్షకులు మాధురి, జిల్లా ఒలింపిక్ సంఘం సలహాదారుడు పి.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



కవిటి: ప్రకృతి వ్యవసాయంతో కుటుంబానికి మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి తులసయ్య తెలిపారు. బుధవారం జమేదారుపుట్టుగలో టీడీపీ నాయకుడు భీమారావు రౌళో 60 సెంట్లు స్థలంలో వేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా భీమారావు రౌళో మాట్లాడు తూ స్థానికంగా లభ్యమైన వనరులను ఉపయోగించి తయారుచేసిన వాటితో అధిక దిగుబడి సాధిస్తున్నామని తెలిపారు. 60 సెంట్లు స్థలంలో 25 రకాల ఆకుకూరలు, తీగ జాతి,వంకాయ,మిరప పంటలను సాగుచేస్తున్నామని చెప్పారు.

వైసీపీ ఓటమే ధ్యేయం


పార్టీలో చేరిన వారితో జనసేన నాయకులు

లావేరు: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమే ధ్యేయంగా పనిచేయాలని ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త విశ్వక్షేన్ పిలుపు నిచ్చారు. బుధవారం మండలం సుభద్రాపురం జంక్షన్ వద్ద గల నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో రణస్థలం మండలానికి చెందిన నగరప్పాలెం గ్రామానికి చెందిన పి.అప్పలనాయుడు, కె.రమణయ్య, ఎం.రామునాయుడు, పి.ఆదినారాయణ, శ్రీను, శ్రీరాములుతో పాటు సుమారు70 కుటుంబాల వారు వైసీపీని వీడిచి నియోజకవర్గం సమన్వయకర్త విశ్వక్షేన్ ఆధ్వర్యంలో జనసేనా పార్టీలో చేరారు. వీరందరినీ జనసేన పార్టీ కండువాను వేసి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రణస్థలం మండల పార్టీ అధ్యక్షుడు, కొచ్చెర్ల సర్పంచ్ బస్వ గోవింద రెడ్డి, పార్టీ నాయకులు వడ్డాది శ్రీనివాసరావు, బి.దుర్గారావు, కాకర్ల బాబాజీ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు మినహా.. అభివృద్ధి శూన్యం

శ్రీకాకుళం అర్బన్: మంత్రి ధర్మాన తన నియోజకవర్గంలో శంకుస్థాపనలు చేయడమే తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. బుధవారం అరసవల్లిలోని తన నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి ధర్మాన పలు సమావేశాల్లో నియోజకవర్గంలో ఏదో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప చేసిందేమీలేదన్నారు. అరసవిల్లిలో, జెండాల వీధిలో, వాంబే కాలనీల్లో మంత్రి ధర్మాన ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేయడాన్ని ఏమని అనుకోవాలో ఆయనే చెప్పాలన్నారు.

ఈవీఎం గోదాముల పరిశీలన

గుజరాతీపేట: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములను బుధవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఆయన ఈవీఎంలను భద్రపరిచిన గోదాములు పరిశీలించారు. గోదాంలోని రక్షణ వలయాన్ని, వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలించి భద్రతా చర్యలను గురించి సమీక్షించారు. ఈవిఎంలను భద్రపరిచిన తీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేసి పర్యవేక్షణ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం

గుజరాతీపేట: బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. నగరంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ సంఘం రాజకీయాలకు అతీతంగా పదేళ్లుగా బీసీల ఐక్యత, అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జనాభాలో 80శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారిన్ని రాజకీయ పార్టీలు దూరం చేస్తున్నాయన్నారన్నారు. కులగణన చేయకపోవడం వల్లే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇది యుద్ధ ప్రాతిపదికన సాగించాలన్నారు. అనంతరం కోనంగి ఎంకన్నను సంఘ జనరల్ సెక్రటరీగా, మైలపిల్లి నర్సింహులకు ఉపాధ్యక్షుడిగా నియమించారు. జిల్లా అధ్యక్షుడు పైడి చంద్రరావు, జనరల్ సెక్రటరీ వెంకన్నయాదవ్, ఉపాధ్యక్షుడు మైలిపిల్లి నర్సింహమూర్తి, కార్యదర్శి ఇప్పిలి మాధుసూధనరావు, డి.సారధి, పాపారావు, దిలిప్ తాండ్ర, శ్రీనివాసరావు, తిరుపతిరావు, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రేంజ్‌లో 14 మంది సీఐల బదిలీ

విశాఖపట్నం,(ఆంధ్రజ్యోతి): త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విశాఖ రేంజ్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల పర్వం కొన సాగుతుంది. సీనియర్లతోపాటు తాజాగా సీఐలుగా పదోన్నతి పొందిన అధికారులకు పోస్టింగ్స్ ఇస్తూ రేంజ్ డీఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రేంజ్ వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు సి.సూర్యనా రాయణకు శ్రీకాకుళం జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎక్స్)లో, అడబాల రవికుమార్‌కు విజయనగరం జిల్లా భోగాపురం యూపీఎస్‌లో, ఏవీ లీలారావుకు విజయనగరం జిల్లా ట్రైనింగ్ సెంటర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇంకా సా లూరు రూరల్ సీఐ ఎస్.ధనుంజయరావును అనకాపల్లి రూరల్ స్టేషన్ సీఐగా, పార్వతీపురం మన్యం జిల్లా కొటియా సీఐ బి.రోహిణిపతిని అదే జిల్లాలో స్పెషల్ బ్రాంచి (ఎక్స్)కు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐ నమ్మి గణేష్‌ను అనకాపల్లి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, విజయనగరం ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్న ఎం.చంద్రశేఖర్‌ను విశాఖ రేంజ్‌కు పంపారు. తాజాగా పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం రేంజ్‌లో ఎదురుచూ స్తున్న గేదెల బాల కృష్ణను పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు రూరల్ సీఐగా, కింతల నారాయణరావును కొటియా సీఐగా, ముదిలి శ్రీనివాసరావును విజయన గరం రూరల్ సీఐగా, డి. దీన బంధును అనకాపల్లి దిశ స్టేషన్ సీఐగా, టి.క్రాంతి కుమార్‌ను అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐగా, ఎస్.సన్యాసినాయుడి అల్లూరి జిల్లా పాడేరు సీఐగా, బమ్మిడి అప్పలనాయుడును గూడెంకొత్తవీధి సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

దైవ చింతనతోనే సన్మార్గం

ఇచ్ఛాపురం రూరల్: దైవ చింతనతోనే మనిషి సన్మార్గంలో పయనించగలడని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి తెలిపారు. బుధవారం తేలు కుంచిలో జరుగుతున్న సుదర్శనయాగంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం గ్రామంలోని 150 మంది భక్తులకు మాలధారణ చేసి సమాశ్రయణ దీక్ష (గురుదీక్షలు) తీసు కున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పి.సాయిరాజ్, ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

35వ రోజుకు చేరిన బెంతుఒరియాల దీక్షలు

కవిటి: తమ సమస్య పరిష్కారానికి కవిటిలో బెంతు ఒరియాలు చేస్తున్న దీక్షలు బుధవారం 35 రోజులు చేరాయి. దీక్షలో మెళియాపుట్టి మండలంలోని బడ్డ గ్రామానికి చెందిన బెంతు ఒరియా కులస్థులు కూర్చొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంతు ఒరియాలకు గతంలో మంజూరు చేసిన ధ్రువపత్రాలు పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రామచంద్ర మజ్జి, ఖగపతి మజ్జి, బిరోసేన్ బిసాయి, తరణి మజ్జి పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ నియామకంపై రగడ

ఇచ్ఛాపురం: మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నియామకంపై రగడ చోటుచేసుకుంది. బుధవారం జరిగిన మున్సిపల్ పాలకమండలి సమావేశంలో ఎజెండాలో పొందుపరిచిన పది అంశాలపై చర్చ జరిగింది. తొమ్మిది అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నియామకంపై కౌన్సిలర్లు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. స్టాండింగ్ కౌన్సిల్ నియామకం కోసం గడువులోగా దరఖా స్తులు చేసుకోవాలని బార్ అసోసియేషన్‌కు సమాచారం ఇచ్చారు. అయితే గడువు చివరి రోజు ఆదివారం (సెలవు దినం) కావడంతో మరుసటి రోజున ఇచ్చిన న్యాయవాదుల దరఖాస్తులను అను మతించాలని మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి చైర్‌పర్సన్, కమిషనర్‌కు కోరారు. గడువు తరువాత వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకో వడం కుదరదని చైర్‌పర్సన్, కమిషనర్ తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి గడువు దినం సెలవురోజు కావడంతో మరుసటి రోజు వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవచ్చని, దీనికి ప్రత్యేకించి జీవో కూడా ఉందని ఆ దరఖాస్తులను పరిశీలనలోకి తీసుకోవాలని స్వర్ణమణి అధికారులతో వాగ్వాదానికి దిగారు. మీరు చెప్పిన జీవోలపై పూర్తి అవగాహన లేదని, లీగల్ ఒపీనియన్ తీసుకొని తెలియజేస్తామని అప్పటి వరకు స్టాండింగ్ కౌన్సిల్ నియామకాన్ని వాయిదా వేస్తున్నామని చైర్‌పర్సన్ తెలిపారు. దీనిపై ఆగ్రహానికి గురైన కౌన్సిలర్లు వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, నోటిఫికేషన్ వస్తే నియామకం కుదరని పేర్కొన్నారు. దీంతో 15రోజుల లోపు దరఖాస్తులు చేసిన వారిలో అర్హులైన వారికి స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించాలని వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాభాల స్వర్ణమణిలు కోరారు. స్వర్ణమణి డీసెంట్ అందించారు. దీంతో ఈ అంశాన్ని వాయిదా వేశారు.

మునిసిపల్ సవరణ బడ్జెట్ ఆమోదం

ఆదాయం వచ్చే ఏ ఒక్క అంశం బడ్జెట్‌లో పొందుపరచకుండా ఎలా బడ్జెట్ ఆమోదిస్తారని, కమిషనర్ సొంత బడ్జెట్‌లా ఉందని మునిసిపల్ వైస్ చైర్‌ప ర్సన్లు లాభాల స్వర్ణమణి, ఉలాల భారతి దివ్య ప్రశ్నించారు. బుధవారం మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, కమిషనర్ ఎస్.రమేష్ అధ్యక్ష తన బడ్జెట్ సమా వేశం జరిగింది. ఈ మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2024-25 బడ్జెట్ అంచనాలు అభ్యం తరాల మధ్య ఆమోదించారు. 2024-25 బడ్జెట్ అంచనా రూ.17కోట్ల 2లక్షల 73వేల 462 ప్రారంభం కాగా 2024-25 సంవత్సరానికి రూ18కోట్ల 4లక్షల 16వేల 462తో ముగిసింది. బడ్జెట్‌లో తెలియజేసిన అభ్యంత రాలను సవరించాలని స్వర్ణమణి ప్రతిపాదనలు అందజేశారు. అనంతరం మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి మాట్లాడుతూ అభ్యంతరాలను స్వీకరించామని, సవరణలు పరిశీలించి మరో సమావేశంలో కౌన్సిల్‌కు తెలియజేస్తామని తెలిపారు. తాగునీటి సమస్య, వీధిలైట్లు, మురుగుకాలువలు, కోతులు, కుక్కలు సమస్యలను ప్రస్తావించకుండా అనవసర అంశాలపై దృష్టి సారించారని ఉలాల భారతి దివ్య ప్రశ్నించారు.

21 మంది ఏఎస్పీలకు బదిలీ


ప్రేమ్ కాజల్

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో 21 మంది ఏఎస్పీలకు బదిలీ చేస్తూ డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీకాకుళం క్రైమ్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న టీపీ విఠలేశ్వరరావును, అడ్మిన్ ఏఎస్పీ జె.తిప్పేస్వామిలను బదిలీ చేశారు. కాకినాడ ఎస్ఈబీ ఏఎస్పీగా విధులు నిర్వర్తించి విశాఖ సిటీకి అటాచ్‌మెంట్‌లో ఉన్న ప్రేమ్ కాజల్‌ను శ్రీకాకుళం అడ్మిన్ ఏఎస్పీగా, ఏలూరు ఎస్సీఎస్టీ సెల్ ఏఎస్పీ బి.ఉమామహేశ్వరరావును శ్రీకాకుళం క్రైమ్ ఏఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

20 మంది ఎస్ఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైం: ఎన్నికల నేపథ్యంలో విశాఖ రేంజ్ పరిధితోపాటు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న 20 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ జీఆర్ రాధిక బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం టూటౌన్ ఎస్ఐ ఎన్.లక్ష్మణరావును ఇచ్ఛాపురం రూరల్‌కి, జేఆర్ పురం ఎస్ఐ గుండపు రాజేష్‌ను కంచిలికి, లావేరు ఎస్ఐ ఎ.కోటేశ్వరరావుని జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కి, వజ్రపుకొత్తూరు ఎస్ఐ వై.మధుసూదనరావును జి.సిగడాం బదిలీ చేశారు. ఇచ్ఛాపురం టౌన్ ఎస్ఐ కె.గోవిందరావును జేఆర్ పురానికి, ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యన్నారాయణని ఇచ్ఛాపురం టౌన్‌కి, శ్రీకాకుళం టూటౌన్-2 ఎస్ఐ కె.లక్ష్మిని టెక్కలి-1 ఎస్ఐగా, జలుమూరు ఎస్ఐ పి.పారినాయుడును కాశీబుగ్గ-1కి, జి.సిగడాం ఎస్ఐ సి.రామారావును వజ్రపుకొత్తూరు, బారువ ఎస్ఐ ఎస్.చిరంజీవిని ఎచ్చెర్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సీసీఎస్ ఎస్ఐ కె.వెంకటేష్‌ను ఆమదాలవలసకు, సంతబొమ్మాళి ఎస్ఐ కె.మధుసూధనరావును జలుమూరుకు, విశాఖ సిటీ నుంచి జి.వాసుదేవరావును శ్రీకాకుళం రూరల్‌కి, శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న వి.వెంకటేశ్వరరావును టెక్కలి-2 ఎస్ఐగా, పొందూరులో ఉన్న షేక్ ఖాదర్ బాషాను డీఎస్‌బీ శ్రీకాకుళం, విజయనగరంలో ఉన్న డి.విజయకుమార్‌ను డీసీఆర్‌బీకి, సీసీఎస్ అటాచ్‌మెంట్‌లో ఉన్న వి.సందీప్ కుమార్‌ను సీసీఎస్‌కు బదలాయించారు. విశాఖ సిటికి బదిలీపై వెళ్లిన ఐ.నాగరాజును ఆమదాలవలస-2కి, ఎన్.సింహాచలంను ఎస్సీఎస్టీ సెల్ శ్రీకాకుళం, జి.శ్యామలరావును శ్రీకాకుళం డీపీటీసీకి బదలాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

విశాఖకు శ్రీకాకుళం తహసీల్దార్..

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం తహసీల్దార్ బాధ్యతలు నిర్వహించిన ఎన్.వెంకటరావుకు బదిలీ అయింది. రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా వెంకటరావును విశాఖ జిల్లాకు అటాచ్‌మెంట్ ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

శ్రీకాకుళం డీటీసీగా చంద్రశేఖర్‌రెడ్డి


బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ రెడ్డి

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం డీటీసీగా (డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్) ఎ.చంద్రశేఖర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో డీటీసీగా బాధ్యతలు నిర్వహించిన శివరాం ప్రసాద్‌కు విజయవాడకు బదిలీ అయింది. డీటీసీగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ గతంలో బాపట్లలో పనిచేసి శ్రీకాకుళం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డీటీసీ తన కార్యాలయంలో సిబ్బంది మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలు/కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.లక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చెరో 40 సీట్లు ఉన్నాయన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం ఒక లక్ష రూపాయలకు మించి ఉండరాదన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి మార్చి 10న ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి అదే మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

అప్రంటీస్ విధానం సరికాదు

గుజరాతీపేట: గతంలో మాదిరిగా అప్రంటీస్ విధానాన్ని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఇది ఎంతమాత్రం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. 1995 నుంచి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని, అప్పుడు రెండేళ్ల అప్రెంటీస్ విధానం ద్వారా రూ.1200 మొదటి సంవత్సరం, రూ.1500 రెండో ఏడాది జీతంగా ఇచ్చారన్నారు. 2008లో ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమ ఫలితంగా ఈ విధానాన్ని రద్దు చేసి పూర్తి జీతం అమలులోకి వచ్చిందన్నారు. అయితే నేడు జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కోసం డీఎస్సీని ప్రకటించింది కానీ, మరలా అప్రంటీస్‌ను విధానాన్ని పెట్టడాన్ని ఏపీటీఎఫ్ తీ వ్రంగా ఖండిస్తోందన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు అభినందన

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి కబడ్డీలో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు సిద్ధమైన జిల్లా క్రీడాకారులకు పలువురు అభినందించారు. కర్నూలులో జరిగిన 49వ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలిక కబడ్డీ పోటీల్లో బాగంగా బాలురకు మూడోస్థానం, బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచారు. ఈ జట్లలో బాలికలకు సంబధించి ఎస్.హర్షిత, టి.లిస్సా, కె.శ్రావణిలు బాలికల విభాగంలో మణికుమార్ జాతీయస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు హాజరవుతారు. వీరికి ఆ సంఘం చైర్మన్ ఎస్.అప్పలరాజు, అధ్యక్షుడు రామలింగంన్నాయుడు, కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, సభ్యులు అభినందించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

రణస్థలం: అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. స్థానిక అగ్నిమాపక సిబ్బందికి మూడు రోజుల పాటు అగ్ని ప్రమాదల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. రసాయనిక పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ పొయ్యిలు వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. ఫైర్ అధికారి పి.అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నియోజకవర్గస్థాయి ఆసరాకు సంబంధించిన చెక్కులను స్పీకర్ తమ్మినేని సీతారాం పంపిణీచేశారు. డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్, కమిషనర్ ఎం.రవి సుధాకర్, ఏఈ అప్పలనాయుడు పాల్గొన్నారు.